సునితారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న కూన శ్రీశైలంగౌడ్

గాజులరామారం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బస్తీలు, కాలనీల్లో కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు మల్కాజిగిరి పార్ల మెంట్ ఎంపీ అభ్యర్థి పట్నం సునితా మహేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. గాజులరా మారం డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకులతో గురు వారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సునితా మహేందర్‌రెడ్డి కుమారుడు రినీష్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధినోళ్ల సంజీవరెడ్డి, డివిజన్ అధ్యక్షులు నాయక్, మాజీ వార్డు మెంబర్ శ్రీనివాస్, నాయ కులు ఎండీ తౌసిఫ్, చాంద్‌పాషా, రశీద్, మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలి

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు వారికి ఇష్టమైన క్రీడల్లో రాణించేలా తల్లిదండ్రులు చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్‌ను గురువారం కేపీహెచ్‌బీ ఏడోఫేజ్‌లో కూకట్‌పల్లి జోనల్‌కమిష నర్ అభిలాష అభినవ్, క్రీడాకారిణి నైనా జైశ్వాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. దరఖాస్తులను బట్టి ఆయా మైదానాల్లో ఉన్న భవనాల్లో ఇండోర్ గేమ్స్ కోసం ఏర్పాట్లు చేయాలని సంబంధిత క్రీడా విభాగం అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. మే 31 వరకు శిక్షణ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

రాజకీయ పార్టీల నాయకులతో జెడ్సీ



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ స్నేహశబరీష్

గచ్చిబౌలి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేశామని, ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని జోనల్ కమిషనర్ స్నేహశబరీష్ శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పార్టీలకు పిలుపునిచ్చారు. గురువారం జోనల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నామినేషన్ల ఘట్టం పూర్తైన సందర్భంగా నియోజకవర్గంలో రాజకీయ పార్టీలు అనుసరించాల్సిన అంశాలపై రాజకీయపార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్‌సీ మాట్లాడుతూ నియోజకవర్గంలో నేటి నుంచి వచ్చేనెల 8వ తేదీ వరకు ఓటర్‌స్లిప్‌ల పంపిణీ జరుగుతుందని, బీఎల్‌ఓలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. స్లిపులు ఓటర్లకు అందుతున్నాయో లేదో రాజకీయ పార్టీలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీలు పాటించాలని, సభలు, సమావేశాలు నిర్వహించే ముందు అనుమతి తీసుకోవాలన్నారు. ఎన్నికల ఖర్చును అభ్యర్థులు తమకు సమర్పించాలని పేర్కొన్నారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న తరుణంలో నియమ నిబంధనలను రాజకీయ పార్టీలు పాటించాలని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని సూచించారు. ఓటర్ స్లిప్‌ల పంపిణీ విషయంలో అవకతవకలు జరిగితే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, సీపీఐ, ఎంఐఎం, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్లతో సమీక్ష

పోలింగ్ స్టేషన్లను సందర్శించి వసతుల కల్పన ఏ విధంగా ఉంది, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వెంటనే తన దృష్టికి తీసుకురావాలని అధికారులకు జోనల్ కమిషనర్ స్నేహశబరీష్ ఆదేశించారు. గురువారం సాయంత్రం నియోజకవర్గంలోని సెక్టార్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం నుంచి ప్రారంభమైన ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమం ఏవిధంగా జరుగుతుందో పరిశీలించాలని, అందరికీ స్లిప్‌లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రతి సెక్టార్ ఆఫీసర్ తన పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని, అక్కడ వసతులు ఏవిధంగా ఉన్నాయో గమనించి ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించాలని, తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. పోలింగ్ రోజు సిబ్బంది పోలింగ్ స్టేషన్‌కు ఏవిధమైన వాహనాలు వెళ్తాయో గుర్తించి ఆ విధంగా ఏర్పాట్లు చేసి తనకు రిపోర్టు చేయాలన్నారు. ముఖ్యంగా బీఎల్‌వోలు చేస్తున్న ఓటర్ స్లిప్‌ల పంపిణీని మానిటరింగ్ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఉపకమిషనర్ రజని కాంత్‌రెడ్డి, నోడల్ అధికారులు లెనిన్‌బాబు, గోపాల్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటేసి ఓటింగ్ శాతాన్ని పెంచాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఎన్నికల అధికారులు

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై అవగాహనలో భాగంగా కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాన్ని ఎన్నికల అధికారులు గురువారం నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని టీఎల్ఎఫ్ (పట్టణ సమాఖ్య), ఎస్ఎల్ఎఫ్ (స్లమ్ సమాఖ్య) సభ్యులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి వారివారి పరిధిలో ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని ఓటింగ్ శాతాన్ని పెంచాలని తెలిపారు. ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటేస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్లు కవిత, బాలరాజు, కిషోర్, వెంకట్‌రెడ్డి, జగదీష్, టీఎల్ఎఫ్, ఎస్ఎల్ఎఫ్‌సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీని భారీ మెజారిటీతో గెలిపించాలి



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టు న్యాయవాదులను కలిసిన ఈటల రాజేందర్



ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

కుషాయిగూడ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. గురువారం ఈటల కుషాయిగూడలో విస్తృతంగా పర్యటించారు. జమ్మిగడ్డ నుండి ప్రారంభమైన ఆయన ప్రచార యాత్ర వి.ఎస్.రెడ్డి నగర్, కుషాయిగూడ మీదుగా కొనసాగింది. అనంతరం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోర్టులో న్యాయవాదులను కలిసి మద్ధతు కోరారు. బీజేపీ పార్టీ నాయకులు మర్రి మోహన్ రెడ్డితో పాటు వివిధ కాలనీల సంక్షేమ సంఘం నాయకులు ఆయన వెంట ప్రచారంలో పాల్గొన్నారు.

ఈటెల గెలుపు... మల్కాజిగిరి మలుపు

మల్కాజిగిరి, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపుతో మల్కాజిగిరి మరింత అభివృద్ధికి నోచుకుంటుందని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ ఉరపల్లి శ్రవణ్ అన్నారు. గురువారం ఆయన శ్రీకృష్ణానగర్, విష్ణుపురి తదితర ప్రాంతాల్లో ఈటలకు మద్దతుగా కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సోమ శ్రీనివాస్, శరత్‌యాదవ్, మురళి, పవన్, రవి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలానగర్‌లో ఈటల ప్రచారం

బాలానగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బీజేపీ మల్కాజిరిగి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ శుక్రవారం ఉదయం 7 గంటలకు బాలానగర్‌లో ఇంటింటా ప్రచారం కార్యక్రమంలో పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు తెలిపారు. బాలానగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి ఈటల ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రచారం ప్రారంభమౌతుందని చెప్పారు. కూకట్‌పల్లి అసెంబ్లీ పరిధిలోని రాష్ట్ర, జిల్లా, డివిజన్ బీజేవైఎం, కమిటీ సభ్యులు వివిధ మోర్చా విభాగాలు, శక్తి కేంద్రాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

29న నడ్డా రోడ్‌షోను విజయవంతం చేయాలి



నడ్డా రోడ్‌షో ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు

నిజాంపేట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజాంపేట కార్పొరేషన్ పరిధిలో ఈనెల 29న సాయంత్రం 6 గంటలకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్వహించే రోడ్‌షోను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ రాంచంద్రరావు అన్నారు. ఈ రోడ్‌షో నిజాంపేట్ భవ్యస్ ఆనంద్ నుంచి అభయాంజనేయస్వామి దేవాలయం వరకు జరుగుతుందన్నారు. నిజాంపేట్ పౌరులందరూ పాల్గొని ప్రధాని మోదీ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన నిజాంపేట్ బీజేపీ సీనియర్ నాయకులతో సమావేశమై, రోడ్‌షో నిర్వహించనున్న ప్రాంతాన్ని గురువారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు సతీష్, రాష్ట్రకార్యదర్శి మాధవి, మాజీ ఉపాధ్యక్షుడు, జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, భద్రయ్య, రోపి, గిరివర్ధన్‌రెడ్డి, విగ్నేష్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

● కొత్తపేట: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో అన్ని విధాల అభివృద్ధి కోసం బీజేపీని గెలిపించాలని ఈటల రాజేందర్ అన్నారు. నాగోల్ చౌరస్తా నుంచి మోహన్‌నగర్ వరకు రోడ్ షో నిర్వహించారు.


కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తం

- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి
- రెండో సెట్ నామినేషన్ దాఖలు
- 'పాంచ్ న్యాయ్'తో అందరికీ ప్రయోజనం



తహసీల్దార్ కార్యాలయంలో నామిషన్ దాఖలు చేస్తున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్

రాజేంద్రనగర్/రంగారెడ్డి అర్బన్, , ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ హస్తం.. పేదల నేస్తమని చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా గురువారం రాష్ట్ర మైనార్టీ గురుకుల విద్యాసంస్థల వైస్‌చైర్మన్ మహ్మద్ ఫయీమ్ ఖురేషీ, వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇతర నాయకులతో కలిసి రాజేంద్రనగర్ తహసీల్దార్ కార్యాలయంలో చేవెళ్ల ఎన్నికల రిటర్నింగ్‌అధికారి, జిల్లా కలెక్టర్ శశాంకకు రెండో సెట్ నామినేషన్‌ను దాఖలు చేశారు. అనంతరం రంజిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే నాలుగు అమలు చేశామని, మిగతా రెండు గ్యారెంటీలను పార్లమెంట్ ఎన్నికల అనంతరం అమలు చేస్తామని అన్నారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ 'పాంచ్ న్యాయ్' పేరుతో మేనిఫెస్టోను తీసుకొచ్చారని తెలిపారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని రంజిత్‌రెడ్డి అన్నారు. దేశాభివృద్ధికి, చేవెళ్ల నియోజక వర్గ అభివృద్ధికి ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు అన్నివర్గాల ప్రజలు మద్దతు ఇచ్చి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ 14 ఎంపీ సీట్లు సాధించడం ఖాయమన్న ఆయన, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే పోటీ ఉంటుందని అన్నారు.



మియాపూర్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగరేద్దాం

మియాపూర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కొండాపూర్ ప్రేమ్‌నగర్, మాదాపూర్ డివిజన్ ఆదిత్యనగర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌ల్లో నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేవెళ్ల అభివృద్ధికి అందరూ కాంగ్రెస్‌కు అండగా నిలవాలన్నారు. నాయకులు కార్యకర్తలు శక్తివంచన లేకుండా పార్టీ అభ్యర్థి గెలుపుకు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్, పార్టీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలి

హైదర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి గురువారం నామినేషన్ వేసిన సందర్భంగా ఆల్విన్‌కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ శివమ్మ కాలనీ అసోసియేషన్ సభ్యులు గురువారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ను కలిశారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కార్పొరేటర్ అసోసియేషన్‌ను కోరారు.

మైనారిటీలకు అండగా నిలిచేది కాంగ్రెస్ ఒక్కటే

సరూర్‌నగర్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మైనారిటీ వర్గాల ప్రజలకు అండగా నిలిచేది కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని, ఆయా వర్గాల ఓటర్లు వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే సంపూర్ణ సహకారం అందించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం రాత్రి బడంగ్‌పేట్ కార్పొరేషన్ బాలాపూర్ 15వ డివిజన్ పరిధిలోని ఆర్చిడ్‌కాలనీ, సీపీఎస్‌ఆర్ కాలనీ, మెట్రోసిటీ తదితర కాలనీల్లో ముస్లిం మైనారిటీ నేతలు, మహిళలతో కలిసి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజాముద్దీన్, అఫ్జల్, బాల్‌సింగని జంగయ్య, రియాసత్, బాబాభాయ్, మెహమ్మద్, రియజ్‌భాయ్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలి



రంజిత్‌రెడ్డితో కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

ఎల్‌బీనగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): హస్తంగుర్తుకు ఓటు వేసి రంజిత్‌రెడ్డిని మరోసారి ఎంపీగా గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు సరూర్‌నగర్ డివిజన్‌లోని అంబేడ్కర్‌నగర్, శంకర్‌నగర్, జైస్వాల్‌కాలనీలలో గురువారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. మాజీ కార్పొరేటర్ అనితాదయాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శంకర్ యాదవ్, బేర బాలకిషన్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కలిసి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరవింద్‌కుమార్, నల్లంకి ధన్‌రాజ్‌గౌడ్, బండి మధుసూదన్, సుదర్శన్ ముదిరాజ్, ఇమ్రాన్, నయిబ్, అరుణ, నాగమణి, లోడి నరసింహ, నాగేష్, జంగారెడ్డి, మల్లేష్, రాఘవేంద్రగుప్త, కందుల రాము, భాగ్యమ్మ పాల్గొన్నారు.

డీజిల్ స్మగ్లింగ్ ముఠా అరెస్టు

రాయదుర్గం, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాకట నుంచి డీజిల్ స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు బుధవారం తెల్లవారుజామున అరెస్ట్ చేశారు. సుమారు రూ.10లక్షల విలువైన 10,800 లీటర్ల డీజిల్‌ను, ఏడు చిన్న ట్యాంకర్లు, ఏడుగురు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. రాధాకృష్ణ అనే వ్యాపారస్తుడు డీజిల్ స్మగ్లర్‌గా రూపాంతరం చెంది, కోట్లాది రూపాయాల విలువ చేసే డీజిల్‌ను కర్ణాటక నుంచి తెలంగాణకు స్మగ్లింగ్ చేస్తున్నట్లు మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో స్మగ్లర్లపై మాదాపూర్ ఎస్ఓటీ టీం గచ్చిబౌలి పోలీసులతో కలిసి నిఘాపెట్టారు. వట్టినాగులపల్లిలోని శ్రీదేవి ఇంజనీరింగ్ కళాశాలకు ఎదురుగా ఉన్న ఓపెన్‌ప్లాట్‌ను అడ్డాగా చేసుకుని కర్ణాటక నుంచి అక్రమంగా ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చిన డీజిల్‌ను ఏడు చిన్న ట్యాంకర్లలోకి మారుస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈదాడిలో ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, డీజిల్‌సర్వీసెస్ కంపెనీ యజమాని సూర్య, సూపర్‌వైజర్ రిషి పరారయ్యారు. డ్రైవర్లు బాలానగర్‌కు చెందిన మహ్మద్ ఇజ్జాముద్దీన్, సంగారెడ్డి అమీన్‌పూర్‌కు చెందిన మహ్మద్ షానవాజ్, అమీన్‌పూర్‌కు చెందిన మహ్మద్ షయ్యద్, హబ్సిగూడకు చెందిన కార్తీక్, మహబూబ్‌బాద్‌కు చెందిన శోభన్, మాదాపూర్ కాకతీయహిల్స్‌కు చెందిన కామేశ్వరరావును అదుపులోకి తీసుకున్నారు. ఏడు ట్యాంకర్లు, 10లక్షల విలువైన డీజిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా రాధాకృష్ణ చేస్తున్న స్మగ్లింగ్ ద్వారా తెలంగాణ రాష్ట్రా ఖజానాకు రూ.కోట్లు గండిపడుతోందని గుర్తించారు. కర్ణాకట నుంచి రూ.86.39కు కొనుగోలు చేసి తెలంగాణలో రూ.95.65కు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. రాధాకృష్ణపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో నమోదైన పలు కేసుల్లో పరారీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. గత నెలలో రాధాకృష్ణ స్మగ్లింగ్ చేస్తున్న 18వేల లీటర్ల డీజిల్‌తో దొరికిపోయాడు. రాధాకృష్ణ రాష్ట్రంలో అనేకమందికి స్మగ్లింగ్ డీజిల్ సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. మరింత విచారణ కోసం గచ్చిబౌలి పోలీసులకు కేసు అప్పగించినట్లు తెలిపారు.

సెంట్రల్ జైలుకు రౌడీషీటర్ తరలింపు



రౌడీషీటర్‌అబిద్‌ను సెంట్రల్ జైలుకు తరలిస్తున్న పోలీసులు

జీడిమెట్ల, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్, భూకబ్జాదారుడు షేక్ అబిద్‌ను కోర్టు ఆదేశాల మేరకు సెంట్రల్ జైలుకు తరలించారు. గాజులరామారం ప్రాంతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నసమయంలో స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో విచ్చలవిడిగా అబిద్ భూకబ్జాలకు పాల్పడ్డాడు. స్థానిక రెవెన్యూ అధికారులపై మహిళలను రెచ్చగొట్టి దాడులు చేయించడం, స్వయంగా రెవెన్యూ అధికారులపై దాడులకు పాల్పడటం, ఎకరాల కొద్ది ప్రభుత్వస్థలాలను కబ్జాచేసి దర్జాగా విక్రయించాడు. ఇతనిపై 16కేసులు నమోదయ్యాయి. ఇతని అనుచరులపై కూడా జగద్గిరిగుట్ట పోలీసులు రౌడీషీట్‌లు తెరిచారు. గాజులరామారం ప్రాంతంలో భూకబ్జాలకు పాల్పడి ప్రభుత్వ స్థలాలను విక్రయించి, పేద ప్రజలను మోసంచేసిన ప్రతి ఒక్కరినీ అరెస్ట్ చేస్తామని తెలిపారు. అబిద్‌ను సంగారెడ్డి జిల్లా కందిలో గల సెంట్రల్ జైలుకు తరలించారు.

సైబర్ సెక్యూరిటీ డేటా సైన్స్‌పై అంతర్జాతీయ సదస్సు

నిజాంపేట్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో హ్యూమానిటీస్, సైన్సెస్ విభాగం, సైబర్‌సెక్యూరిటీ డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటాసైన్స్ విభాగాల్లో అప్లైడ్ మాథ్యమేటిక్స్ అండ్ అడ్వాన్స్డ్ డేటా ఎనలిటిక్స్ ఫర్ ఇండస్ట్రీ 5.0 పేరిట ఆచార్య డాక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 270 మంది పరిశోధకులు, విద్యానిపుణులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విదేశాంగశాఖ మాత్య సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ గిరీష్‌కుమార్, ఇస్రో సీనియర్ శాస్త్రవేత డాక్టర్ రీతు కరిధల్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జనరల్ గిరీష్‌కుమార్ మాట్లాడుతూ సాంకేతికతరంగంలో గణితశాస్త్రం, డేటాసైన్స్ పాత్ర అత్యధిక ప్రాముఖ్యమైనదన్నారు. డ్రోన్‌లను వాడి డేటాను సేకరిస్తున్న నేటికాలానికి అనుగుణంగా కంప్యూటరింగ్‌లో మరింతవేగం, మార్పులు రావాలని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహేంద్ర విశ్వవిద్యాలయ సలహాదారు ఏఐ విభాగాధిపతి డాక్టర్ అరుణ్‌కుమారిపూజారి, ఎన్‌ఆర్‌ఎస్‌సీ ఉపసంచాలకులు డాక్టర్ కె.శ్రీనివాస్, సైబర్‌సెక్యూరిటీ ఆఫ్ ఎక్సలెన్స్ సీఈఓ డార్టక్ శ్రీరామ్ బిరుదవోలు, డాక్టర్ డి.శ్రీనివాసాచార్య, డాక్టర్ సదాశివులు, జేఎస్‌రావు పాల్గొన్నారు.

నాటకరంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయం

ప్రారంభమైన పరుచూరి రఘుబాబు స్మారక నాటక పోటీలు



నాటక పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

రవీంద్ర భారతి, ఏప్రిల్ 25 (ఆంధ్ర జ్యోతి): మూడు దశాబ్దాలుగా నాటక పోటీలు నిర్వహిస్తూ నటీనటులను ప్రోత్సహించడంతోపాటు రంగస్థల వృద్ధికి పరుచూరి బ్రదర్స్ కృషి చేయడం అభినందనీయమని వక్తలు కొనియాడారు. గురువారం రవీంద్రభారతిలో పరుచూరి రఘుబాబు స్మారక 34వ జాతీయ స్థాయి నాటిక పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఆచార్య డీఎస్ఎన్.మూర్తి, పరుచూరి గోపాలకృష్ణ, పరుచూరి వెంకటేశ్వరరావు, గుమ్మడి గోపాలకృష్ణ, దైవజ్ఞశర్మ, నటి శివపార్వతి తదితరులు హాజరయ్యారు. నాటక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ 34 సంవత్సరాలుగా పరుచూరి రఘుబాబు పరిషత్తులో దాదాపు 600 నాటకాలను ప్రదర్శించారని గుర్తు చేశారు. పరుచూరి రఘుబాబు పేరిట నాటక పోటీలను నిర్వహించి నాటకరంగాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ తాను సిటీ కాలేజీలో చదువుతున్నప్పుడు దేశంలోనే పేరొందిన రవీంద్రభారతిలో నటించాలని ఉండేదని గుర్తు చేసుకున్నారు. సభానంతరం మొదటి రోజు నాటకాలను ప్రదర్శించారు. అన్ని నాటకాలు ఒకటితో ఒకటి పోటీ పడుతూ సాగాయి.

29 నుంచి చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం

నల్లకుంట, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ సంస్థ కూకట్‌పల్లి శాఖ, అగర్వాల్ సమాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి మే 11వ తేదీ వరకు ఇస్కాన్ గీతా క్యాంపు శీర్షికన చిన్నారులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నామని సంస్థ కూకట్‌పల్లి శాఖ కో-ఆర్డినేటర్లు శ్రీవాణి, రోమా, విజయలక్ష్మి తెలిపారు. గురువారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. వివరాలకు 9440486792, 9849019590, 9346373661 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

దృష్టి మరల్చి దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

● రూ.10.62లక్షల విలువైన నగలు స్వాధీనం

హైదర్‌నగర్, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): బంగారు దుకాణాలలో వినియోగదారుడిలాగా ప్రవేశించి సేల్స్‌మెన్ దృష్టిమరల్చి చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను కేపీహెచ్‌బీ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. కూకట్‌పల్లి జోన్ ఏసీపీ శ్రీనివాసరావు గురువారం వివరాలను వెల్లడించారు. భువనగిరి జిల్లా నాగయ్యపల్లి తండాకు చెందిన బానోతు భాస్కర్(21) బిల్డింగ్ మెటీరియల్ సప్లై కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. భాస్కర్ విలాసాలకు అలవాటుపడి క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ రమ్మీ, మద్యానికి బానిసై డబ్బుల సంపాదన కోసం చోరీల బాటపట్టాడు. బంగారు దుకాణంలోకి కస్టమర్‌గా వెళ్లి పలు చైన్లు చూపించమని సేల్స్‌మెన్‌కు చెప్పి నగలు చూపించే క్రమంలో వారిని మభ్యపెట్టి వాటిని కాజేసేవాడు. ఈనెల 3న కూకట్‌పల్లి లలితా జువెల్లర్స్‌లోకి ప్రవేశించి చైన్‌ను దొంగతనం చేశాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న కేపీహెచ్‌బీ పోలీసులు షాప్‌లోని సీసీపుటేజ్ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. గురువారం ఉదయం కేపీహెచ్‌బీలో ఓ నగల దుకాణం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న భాస్కర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతను గతంలో కేపీహెచ్‌బీ పరిధిలోని రెండు దుకాణాలు, పంజాగుట్ట, మహంకాళి, నిర్మల్, మిర్యాలగూడ, మక్తల్, చైతన్యపురి స్టేషన్ల పరిధుల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. అతని నుంచి రూ.10,62,800 విలువ గల నగలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జేఎన్‌టీయూ క్యాంపస్‌లో కారు బీభత్సం

ఇద్దరు విద్యార్థినులకు తీవ్రగాయాలు

జేఎన్‌టీయూ, ఏప్రిల్ 25 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి క్యాంపస్‌లో గురువారం ఓ కారు బీభత్సం సృష్టించింది. క్యాంపస్‌కు చెందిన ఓ విద్యార్థి అద్దెకు కారు తీసుకున్నాడు. సిటీ బయట పార్టీ చేసుకునేందుకు క్యాంపస్‌లో ఉండేస్నేహితులు (అమ్మాయిలు, అబ్బాలు)లను కారు ఎక్కించుకునేందుకు వచ్చాడు. అతను క్యాంటిన్ వద్దకు రాగానే కారు అదుపు తప్పి విద్యార్థులపై దూసుకెళ్లింది. ఒక అమ్మాయికి కాలు విరిగింది. మరో అయిదు మీటర్ల దూరంలో మరో అమ్మాయిని ఢీ కొట్టడంతో సదరు విద్యార్థినికి మోచేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అందరూ క్యాంపస్ స్టూడెంట్స్ కావడంతో ఇరువురి తల్లిదండ్రులను పిలిపించి అధికారులు పోలీసు కేసు నమోదు కాకుండా చూసినట్లు తెలిసింది. ఇదే కారులో బ్యాగులు ఉండటం, అందులో ఉన్న సామగ్రి గురించి అధికారులు, పోలీసులు బయటపడకుండా జాగ్రత్తలు తీసుకోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ యాక్సిడెంట్‌పై ప్రొఫెసర్లతో త్రిసభ్య కమిటీ వేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.